


ముత్తైమంతా చినుకు..

మబ్బు ముసిరితే.. మెరుపు మెరిస్తే.. వాన కురిస్తే.. సకల చరాచర ప్రకృతీ పులకిస్తుంది. తడితాకిన ప్రతి తనువూ తుళ్లిపడుతుంది. కిలకిలమంటూ కళకళలాడుతుంది. కనువిందు చేస్తుంది. సాయంత్రపు చల్లదనాన్ని ఆస్వాదించడానికి బుధవారం చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు, జింకల పార్కు, బీవి రెడ్డి పిల్లల పార్కులకు జనాలు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కెమెరాకు చిక్కిన చినుకు అందాలివి..

- చిత్తూరు (కల్చరల్), ఆంధ్రజ్యోతి

ముసురువాన

- 117 ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- టమోటా కోతలు వద్దు
- నేడు పాఠశాలలకు సెలవు



విజయపురం మండలం మాధవరం వద్ద నీటమునిగిన వరిపంట



కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయం ముందు నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు/చిత్తూరు సెంట్రల్ , అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో బుధవారం జిల్లాలో ముసురువానలు కురిసాయి. పలు చోట్ల రోజంతా చినుకులు పడినా మోస్తరు వర్షానికే పరిమితమైంది. గురువారం కూడా వర్షాలు కొనసాగనుండడంతో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థలకు కలెక్టర్ సుమిత్ కుమార్ సెలవు ప్రకటించారు.విజయపురం మండలంలో మాత్రం ఎడతెరపి లేని వర్షం కురవడంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది.చెరువుల్లో 50 శాతానికి పైగా నీళ్లు చేరాయి.పాతార్కాడు, ఇళ్ళత్తూరు పెద్దచెరువు, మహావీరాపురం చెరువులు మొరవ పారుతున్నాయి.చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు పనుల్లో భాగంగా వర్షపునీరు వెళ్ళడానికి దారి పూడిపోవడంతో కలియంబాకం వద్ద పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి.నగరి మండలం నగరిపేట ప్రాంతంలో నివాసాల్లోకి



విజయపురం మండలంలో మొరవ పారుతున్న ఇళ్ళత్తూరు పెద్ద చెరువు

వర్షపునీరు ప్రవహించడంతో ప్రజలు అవస్థ పడ్డారు. సదుంలో ముసురువానతో జనజీవనం స్తంభించింది.వర్షాల కారణంగా పొలాల్లో నీరు చేరడంతో కోత దశలో వున్న వరి పంట నేలవాలిపోయింది. కొన్ని చోట్ల కోత దశలోని వేరుశనగ సైతం దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. 22 గ్రామాల్లోని 117 ఎకరాల్లో 84మంది రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. టమోటా రైతులు పంటను కోసి నష్ట పోరాదని మార్కెటింగ్ శాఖ అధికారులు హెచ్చరించగా, వి.కోట నుంచి ఇప్పటి వరకు 25 టన్నుల కూరగాయలను వర్ష ప్రభావిత ప్రాంతాలైన విజయవాడ, నెల్లూరు జిల్లాలకు పంపారు.మిగిలిన వరి, వేరుశనగ, కంది, మినుము, పెసలు పంటలు కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో వర్షపు నీరు నిల్వకుండా కాలువలు తీసి బయటకు పంపాలని సూచించారు. వరి పంట పాలు పోసుకునే దశలో ఉండి 2,3 రోజులు తడిస్తే గింజ గట్టిపడదని, రంగు మారితే అమ్మకం ధర తగ్గిపోతుందని రైతులు గమనించాలన్నారు. కోత దశలోని వరి పనలను దుబ్బులుగా కట్టుకోవడంతో నష్టం తగ్గించుకోవచ్చునన్నారు. వరితో పాటు కంది, మినుము, పెసలు పంట పొలాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా టమోటా పంట కోస్తే నల్లమచ్చలు ఏర్పడి ధర తగ్గిపోయే ప్రమాదం వుంది కాబట్టి రైతులు ఇప్పట్లో పంట కోయరాదని మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్ సూచించారు.కాగా మెరుపులు, పిడుగుల కారణంగా పాడిపశువులకు నష్టం వాటిల్లకుండా పాడి ఆవులను, మేకలను, గొర్రెలను, పశువులను మేతకు బహిరంగ ప్రదేశాలకు తీసుకుపోవద్దని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ప్రభాకర్ సూచించారు.పశువులను సురక్షిత ప్రదేశంలో ఉంచాలన్నారు.పశువైద్యాధికారులు, సిబ్బంది పనిచేసే ప్రదేశాల్లో తప్పక ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎవ్వరికీ సెలవు లేవని తెలిపారు. వర్షాలు, చలిగాలుల కారణంగా పశువులకు శ్వాసకోశ వ్యాధులు వచ్చే వీలున్నందున, ప్రత్యేక వైద్య బృందాలను గ్రామాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

నింద్రలో 117 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా నింద్రలో 117.4 మి.మీ , అత్యల్పంగా కుప్పంలో 11.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా కార్వేటినగరంలో 77.6మి.మీ , నగరిలో 77.2, విజయపురంలో 68.4, సదుంలో 60.8, పులిచెర్లలో 58, రొంపిచెర్లలో 58.8, ఎస్ఆర్‌పురంలో 43.8, పెనుమూరులో 43.2, ఐరాలలో 37.8, సోమలలో 37.8, చౌడేపల్లిలో 37.4, పాలసముద్రంలో 35.2, పూతలపట్టులో 34.4, పుంగనూరులో 33.2, చిత్తూరు రూరల్‌లో 31.2, జీడీ నెల్లూరులో 28.2, వెదురుకుప్పంలో 26, తవణంపల్లెలో 26, గుడిపాలలో 25.8, గంగవరంలో 23.8, చిత్తూరులో 23, గుడుపల్లెలో 22.6, రామకుప్పంలో 22.6, వి.కోటలో 22.4, పెద్దపంజాణిలో 21.6, శాంతిపురంలో 21, పలమనేరులో 18.8, యాదమరిలో 17.8, బంగారుపాళ్యంలో 15.2, బైరెడ్డిపల్లిలో 17.6 మి.మీ వర్షం కురిసింది.



యాదమరి మండలంలో దెబ్బతిన్న వరిపంట

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు: డీపీవో

వర్షాలతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి డీపీవో పార్వతి ఆదేశించారు. బుధవారం ఆమె కార్యాలయం నుంచి ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాలువల్లో పూడికలు, వీధుల్లో చెత్తాచెదారాలు సకాలంలో తొలగించాలని ఆదేశించారు. క్రిమికీటకాలు చేరకుండా గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ ఉండాలన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రంచేయాలని, వాటిపై శుభ్రంచేసిన తేదీని రాయించాలని చెప్పారు. మురుగునీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వర్షాలు నిలిచేంతవరకు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

47 మద్యం దుకాణాలు ప్రారంభం

- బృందాలుగా దరఖాస్తు చేసుకుని అధిక షాపులను దక్కించుకున్న టీడీపీ నేతలు
- భాగస్వామ్యంకోసం పలుచోట్ల యత్నాలు



చిత్తూరు దర్గా సర్కిల్‌లో ప్రారంభమైన మద్యం దుకాణం

చిత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 104 మద్యం దుకాణాలకుగానూ 47 బుధవారం ప్రారంభమయ్యాయి.మరో 32 దుకాణాలు గురువారం ప్రారంభం కానున్నాయి.లాటరీలో 66 దుకాణాలు స్థానికులకు, 26 స్థానికేతరులకు దక్కాయి. టీడీపీ మద్దతుదారులు 77దుకాణాలను దక్కించుకోగా 12దుకాణాలు వైసీపీ మద్దతుదారులకు, రెండు జనసేన మద్దతుదారులకు, ఒకటి బీజేపీ మద్దతుదారుకు దక్కినట్లు సమాచారం.విపక్ష మద్దతుదారులు దుకాణాలను దక్కించుకున్న చోట అధికార పార్టీ నాయకులతో ఒప్పందాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.యాదమరి మండలంలో మూడు షాపులుండగా.. రెండు వైసీపీ, ఒకటి టీడీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు.వైసీపీకి చెందిన రెండు షాపులను కలిసి మెలిసి నిర్వహించుకునేందుకు రెండు పార్టీలూ నిర్ణయించుకున్నాయి. పూతలపట్టు మండలంలో మూడు దుకాణాలకు గానూ.. రెండు టీడీపీ మద్దతుదారులకు, ఒకటి తటస్థుడికి దక్కింది. టీడీపీకి దక్కిన రెండు దుకాణాలు బుధవారం ప్రారంభమయ్యాయి.తటస్థుడికి దక్కిన దుకాణంలో భాగస్వామ్యంకోసం స్థానిక టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.కుప్పం మున్సిపాలిటీలో 5 షాపులుండగా.. టీడీపీ నాయకులు మూడు బృందాలుగా మారడంతో అన్నీ వారికే దక్కాయి. వి.కోట మండలంలో మూడు దుకాణాలకుగానూ 31 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 7 దరఖాస్తులు ఇతరులు వేయగా.. లాటరీ నిర్వహణకు ముందే ఆ ఏడుగురికి డబ్బులిచ్చి టీడీపీ వాళ్లే తీసేసుకున్నారు.చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు కొన్ని దుకాణాల్ని దక్కించుకున్నారు. ఇక్కడ కూడా టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు వారితో ఒప్పందాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. చౌడేపల్లె మండలంలో మూడు దుకాణాలుండగా.. బుధవారం ఓ దుకాణం ప్రారంభమైంది. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే బోయకొండవానికి ఓ దుకాణం దక్కింది. అయితే బోయకొండలో కాకుండా సగం వాటా ఇచ్చేసి చౌడేపల్లెలో ప్రారంభించుకోవాలని కొందరు టీడీపీ నాయకులు చెప్పడంతో ఆ దుకాణం తెరచుకోలేదు. బోయకొండలో పెద్దఎత్తున వ్యాపారం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ టీడీపీ నాయకులే ప్రారంభించాలని చూస్తున్నారు.

- **పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ**

పలమనేరు మున్సిపాలిటీలో ఓ దుకాణం కర్ణాటక రాష్ట్రం నంగిలికి చెందిన వ్యక్తికి దక్కింది. ఇందులో వాటా ఇవ్వాలని స్థానిక టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కోరగా.. అతను ఒప్పుకోలేదు. దీంతో టీడీపీ నాయకులు దుకాణాన్ని ప్రారంభించకుండా అడ్డుకున్నారు. దీంతో దుకాణదారుడు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా స్టేషనులో పంచాయితీ జరిగింది. వందలమంది స్టేషను వద్దకు చేరుకున్నారు. నంగిలికి చెందిన వ్యక్తి దుకాణం ప్రారంభించుకోవడానికి ఉన్నతాధికారి ఆదేశాల మేరకు పోలీసులు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకే సోమల మద్యం షాపులు

సోమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మూడు వైన్‌షాపులకు 40 మంది పోటీ పడ్డారు. గతంలో ప్రైవేట్ మద్యం షాపులు నడిపిన హేమాహేమీలు సిండికేట్‌గా మారి టెండర్లు వేశారు. కానీ వీరి మధ్యలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మూడు షాపులను దక్కించుకోవడం చర్చనీయాంశమైంది. పెద్ద ఉప్పరపల్లెలో జనసేన పార్టీ మద్దతుదారు ధర్మతేజ మద్యం షాపును దక్కించుకున్నాడు.ఈయన బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు.నెల్లిమంద పంచాయతీ కమ్మపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దీపక్ కుమార్ గత ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం సొంత డబ్బు ఖర్చు చేశాడు.కందూరులోనో, సోమలలోనో నేడో రేపో షాపు ప్రారంభించనున్నాడు.మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకటరత్నం సోమలలో మిత్రులతో కలసి మద్యం షాపును ప్రారంభించాడు.

74 గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ

- రూ.9.20 కోట్లతో 183 పనులు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 46 గ్రామ పంచాయతీల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.9.20 కోట్లతో 183 పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పూతలపట్టు మండలం వెంకటాపురం, బంగారుపాళ్యం మండలం తంబుగానిపల్లె, నలగాంపల్లె, సదకుప్పం, తుంబకుప్పం గ్రామ పంచాయతీల్లో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు.శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలి రోజు నుంచి ఇప్పటి వరకు రూ.15.78 కోట్లతో 356 పనులు చేపట్టారు.

పెనుమూరు పీహెచ్‌సీ రద్దు

- డీసీహెచ్ఎస్‌కు సిబ్బంది సరెండర్

పెనుమూరు, అక్టోబరు 16: పెనుమూరులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో పనిచేస్తున్న సిబ్బందిని డీసీహెచ్ఎస్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించింది. పెనుమూరుకు 2022లో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మంజూరైంది. దీంతో అప్పటి జిల్లా వైద్యశాఖ అధికారులు పీహెచ్‌సీని మండలంలోని శాతంబాకంలో నిర్వహించాలని సూచించారు.అయితే సీహెచ్‌సీ ఉందని పీహెచ్‌సీని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. అయితే పీహెచ్‌సీ సిబ్బంది అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఈ విషయాన్ని తెలిపి తమకు అన్యాయం జరుగుతోందని విన్నవించుకున్నారు. దీంతో ఆయన పెనుమూరు పీహెచ్‌సీని రద్దు చేయరాదని అధికారులకు సూచించడంతో సమస్య సద్దుమణిగింది. కూటమి ప్రభుత్వం రాగానే వైద్య శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేస్తున్న నేపథ్యంలో పెనుమూరు పీహెచ్‌సీని కూడా రద్దు చేస్తూ ఆర్డర్స్ వెలువడ్డాయి. పెనుమూరు పీహెచ్‌సీలో ప్రస్తుతం ఇద్దరు డాక్టర్లు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, ఒక సీనియర్ అసిస్టెంట్, సీహెచ్‌వో, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు అటెండర్లు, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ మొత్తం 12 మంది సిబ్బంది ఉన్నారు. వీరిని ప్రస్తుతానికి డీసీహెచ్ఎస్‌కు సరెండర్ చేశారు. ఒకవేళ వీరి అవసరం సీహెచ్‌సీలో ఉంటే అందులో కొనసాగిస్తారు. లేదనుకుంటే డీఎంఅండ్‌హెచ్‌వోకు సరెండర్ చేసి ఎక్కడ అవసరం ఉంటుందో అక్కడకు పంపుతారు. సచివాలయంలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలను ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగిస్తారని సమాచారం.



వార్డుల్లోనూ గొడుగు పట్టాల్సిందే

తిరుపతి రుయాస్పత్రి బయటే కాదు.. లోపలా వర్షానికి రోగులు ఇబ్బంది పడ్డారు. పలు వార్డుల్లోని భవనాలు శిథిలదశలో ఉండటంతో వర్షానికి వాటిల్లో నుంచి నీరు కారి నేలంతా తడిసి ముద్దయింది. రోగులు, వారి సహాయకులూ తడిచారు. వార్డుల్లో నుంచి వచ్చే క్రమంలోనూ, పరీక్షలకోసం బయటకు వెళ్లేటప్పుడు.. ఆస్పత్రికి వెళ్లే సమయంలో వానకు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా ఓపీ, ఎంఎం, ఎఫ్ఎస్, వార్డుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపించింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

రెక్కే..ఇంతుంటే!

ఓజిలి సమీపంలో పెద్దపరియ క్రాస్ రోడ్డు దగ్గర జాతీయ రహదారి మీద నిలబడివున్న ఈ రైలంత లారీని దారిన పోయేవాళ్లంతా ఆగి మరీ చూశారు. ఏ రాకెట్టునో లారీ మోసుకుపోతోందేమో అని కళ్లింత చేసుకున్నారు. తీరా ఆరా తీస్తే.. అది విండ్‌మిల్‌లో ఉండే ఒక రెక్క మాత్రమే. రెక్కే ఇంతుంటే కరెంటును పుట్టించే ఆ గాలిఫ్యాను ఇంకెంత ఉంటుందో అని విస్తుపోయారు.

- ఓజిలి, ఆంధ్రజ్యోతి




కొండూరుపాళెం వద్ద సముద్ర ముఖద్వారాలు

పాలకుల నిర్లక్ష్యం మత్స్యకారులపాలిట శాపంగా మారింది. సముద్ర ముఖద్వారంలో మేట వేసిన పూడికను తీయకపోవడం వల్ల వేలాది మంది ఉపాధికి ముప్పు వాటిల్లింది.

సముద్ర ఘోష

- సముద్ర ముఖద్వారంలో పేరుకుపోతున్న మేట
- పులికాట్‌లో తగ్గిపోతున్న నీటిమట్టం
- తరిగిపోతున్న మత్స్య సంపద
- పూడిక తీయక ఉపాధి కోల్పోతున్న జాలర్లు

వాకాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండూరుపాళెం, పూడిరాయదొరువు సముద్ర ముఖద్వారం వద్ద లోతు కనీసం 10 నుంచి 15 అడుగులు ఉండాలి. ప్రస్తుతం 5 అడుగుల లోతు మాత్రమే ఉంది. ఇందువల్ల పడవలు సముద్రంలోకి వెళ్లేందుకు వీలు కావడం లేదు. ఇక్కడ పడవలు చిక్కుకుపోతున్నాయి. పడవలు సముద్రంలోకి వెళ్లకపోతే చేపలవేట సాధ్యం కాదు. కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల నుంచి బకింగ్‌హాం కెనాల్‌లో మూడు కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తే సముద్ర ముఖద్వారం వస్తుంది. మార్చి నెల నుంచి సెప్టెంబరు, అక్టోబరు దాకా ముఖద్వారం వద్ద ఇసుకమేట వేస్తుంటుంది. ఎక్కడ ఎంత లోతు, మెరక ఉందో అంచనా వేయడం కష్టం. దీంతో మేట వేసిన ప్రాంతాల్లో మరపడవలు చిక్కుకుపోయి దెబ్బతింటున్నాయి. నాయకులకు, అధికార్లకు ఈ సమస్య గురించి మత్స్యకార్లు చెప్పుకుంటూనే ఉన్నారు. జగన్ ప్రభుత్వంలో సాగరమాల అంటూ హడావుడి చేసి మాయ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది గనుక ఇప్పుడైనా పూడిరాయదొరువు, కొండూరుపాళెం వద్ద హార్బర్ ఏర్పాటుచేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఈ ప్రతిపాదన ఏమైంది?

రాయదొరువు వద్ద ముఖద్వారాలు లోతు తీయాలని కేంద్ర జల సంఘం నిపుణుల కమిటీ 2015లోనే సిఫారసు చేసింది. ఇందుకు రూ.48 కోట్లు ఖర్చు అవుతుందని కూడా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

జగన్ మాయ

సాగరమాల ద్వారా 160 కోట్లతో పూడిరాయదొరువు వద్ద హార్బర్ ఏర్పాటు చేసేందుకు మరొక ప్రతిపాదన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ హైలెవల్ కమిటీ, జాతీయ తీరప్రాంత పరిశోధన సంస్థ, ఎండోమర్ కోస్టల్ హైడ్రాలిక్ డైరెక్టర్లు ఈమేరకు నివేదికలు తయారు చేశారు. పూడిరాయదొరువు వద్ద సముద్రంలోకి 2 కిలోమీటర్లు పొడవు, 400 మీటర్లు వెడల్పు, 12 అడుగుల లోతు ఉండేలా గోడలను నిర్మించాలని సూచించారు. ఇందువల్ల పెద్ద ఓడలను కూడా నిలుపుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. 2022లో జగన్ ప్రభుత్వం పెద్ద హడావుడే చేసింది. పనులు ప్రారంభిస్తున్నామంటూ ప్రకటించారు. అంగుళమైనా ముందుకు తీసుకువెళ్లలేదు. జాలర్ల ఓట్ల కోసం ఆర్భాటపు ప్రకటనలు చేసి చేతులెత్తేశారు.

- **పులికాట్ విస్తీర్ణం:** ఆంధ్రప్రదేశ్‌లో 400కి.మీ., తమిళనాడులో 61కి.మీ.
- వాకాడు, చిల్లకూరు, కోట, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ఉన్న మర పడవల సంఖ్య: 362.
- చేపల వేట ఉపాధిగా గల కుటుంబాలు: 60వేలు.

తమిళ జాలర్లతో గొడవలు

ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో ఉన్న పులికాట్ సరస్సులో మనవైపు సముద్ర ముఖద్వారాలకే ఈ సమస్య అంతా. ముఖద్వారాలు పూడిపోవడంతో పులికాట్ సరస్సులో నీటిమట్టం కూడా తగ్గిపోతోంది. మత్స్య సంపద వృద్ధి కాదు. ఇదే తమిళనాడు పరిధిలోని ముఖద్వారాలు తెరుచుకొని ఉన్నాయి. ఎప్పటికప్పుడు తమిళనాడు ప్రభుత్వం పూడిక తీత పనులు చేపడుతూ ఉంటుంది. దీంతో ఆ ప్రాంతంలో నీరు పుష్కలంగా ఉంటుంది. ఇందువల్ల తమిళ జాలర్లు ఏడాది పొడవునా వేట సాగిస్తున్నారు. ఆంధ్ర పరిధిలోనే సరస్సు అధికభాగం ఉన్నా మన జాలర్లకు ఉపాధి కరువవుతోంది. పూడిరాయదొరువు, కొండూరుపాళెం ప్రాంతాల వద్ద లోతు తక్కువగా ఉండటంతో వేట సమయంలో ఆంధ్ర జాలర్లను తమిళ జాలర్లు అడ్డుకుంటూ ఉన్నారు. ఇందువల్ల తరచూ ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి.



తిరుమల ఘాట్‌లో విరిగి పడిన కొండచరియలు


తిరుమల ఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద పడిన కొండచరియలు

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాల నేపథ్యంలో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌రోడ్డులోని మూడుప్రదేశాల్లో బుధవారం కొండచరియలు విరిగిపడ్డాయి. వర్షపు నీటిలో బాగా నానిపోయిన కొండచరియలు 15వ కిలోమీటరు, హరిణి ప్రాంతం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో పడ్డాయి. అయితే సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వీటిని ఎక్స్‌కవేటరు, ట్రక్కులు, ట్రాక్టర్ల సహాయంతో వేగంగా తొలగించారు. పైగా రోడ్డుకు పక్కభాగాల్లోనే పడటంతో వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మరికొన్ని ప్రదేశాల్లోనూ కొండచరియలు విరిగిపడే అవకాశాలున్నట్టు గుర్తించిన అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. అక్కడ కూడా కొండచరయిలు విరిగిపడే వెంటనే స్పందించి తొలగించేలా అప్రమత్తంగా ఉన్నారు. ఇక, జీఎన్సీ, అలిపిరి వద్ద వాహనదారులను భద్రతాసిబ్బంది అప్రమత్తం చేసి ఘాట్‌రోడ్లలోకి అనుమతిస్తున్నారు. ఇక, తిరుమలలో బుధవారం విడతలవారీగా కురిసిన వర్షంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దర్శనానికి వెళ్లే సమయంలోను.. దర్శనం పూర్తి చేసుకుని ఆలయం వెలుపలకు వచ్చాక తడుస్తూనే వెళ్లారు. కొందరు గొడుగుల్లో, మరికొందరు తమ వద్దనున్న వస్త్రాలు కప్పుకుని వెళ్లారు. చలి కూడా పెరిగింది. భారీ వర్షాల నేపథ్యంలో పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను టీటీడీ మూసివేసింది. బుధవారం ఉదయానికి తిరుమలలోని ఐదు డ్యాముల్లో 250 లక్షల గ్యాలన్ల నీరు చేరింది.

కొండ చరియలపై ప్రత్యేక నిఘా

ఘాట్ రోడ్లలోని కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. విపత్తుల నిర్వహణ ప్రణాళికలపై చర్చించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తగా జనరేటర్ల కోసం డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, సీవీఎస్వో శ్రీధర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారిమెట్టు మార్గం మూసివేత

భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు నడిచివచ్చే మార్గాల్లో ఒకటైన శ్రీవారిమెట్టు మార్గాన్ని టీటీడీ గురువారం మూసివేయనుంది. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈనిర్ణయం తీసుకుంది. వర్షాలు అధికంగా కురిసిన నేపథ్యంలో ఆమార్గంలో వరద నీరు అధికంగా ప్రవహిస్తుంది. ఈక్రమంలో టీటీడీ గురువారం ఒక్కరోజు తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయం తీసుకుంది.


గొడుగుల్లో వెళుతున్న భక్తులు

ఎన్నికల పెండింగ్ బిల్లులకోసం రూ.19.18 కోట్లు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పెండింగ్ బిల్లుల చెల్లింపులకోసం జిల్లాకు రూ.19.18 కోట్లు బుధవారం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో విడుదల చేసిన నిధులకు అదనంగా రెండో విడతగా ప్రస్తుతం నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను ఇతర శాఖలచే జరిగిన పనులకు వెచ్చించరాదని ఆ ఉత్తర్వులో సూచించారు. ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులకు, సిబ్బందికి టీఏ బిల్లులు రూపేణా రూ.7.88 కోట్లు, స్టేషనరీ, ఆఫీసు ఖర్చులకోసం రూ.3.22 కోట్లు, వాహనాల వినియోగం కోసం చెల్లించాల్సిన పెట్రోల్, డీజల్ బిల్లుల చెల్లింపులకోసం రూ.1.37 కోట్లు, ఓటర్ల జాబితా, ఇతర చెల్లింపుల బకాయిల కోసం రూ.1.57 కోట్లు, ఇతరత్రా ఖర్చుల పెండింగ్ బిల్లులకోసం రూ.4.36 కోట్లు, ఎన్నికలకు వినియోగించిన అద్దె వాహనాల బిల్లుల చెల్లింపులకోసం రూ.75.95 లక్షలు విడుదల చేశారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లలో చిత్తూరుకు మొదటి స్థానం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ నామినేషన్ల దాఖలులో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను జూలై ఒకటిన మొదలైన ఇన్‌స్పైర్ నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 15 నాటికి ముగిసింది. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 657 పాఠశాలల నుంచి 2766 నామినేషన్లు దాఖలు చేసి చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల ఆలోచనలను నమూనా రూపంలో ప్రదర్శించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించినట్లు డీఈవో దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి రమణ తెలిపారు.

ఆశలు ఆవిరై..!

- విషాదం మిగిల్చిన అమెరికా ప్రమాదం
- ఇద్దరు శ్రీకాళహస్తివాసులు, ఓజిలికి చెందిన ఒకరు దుర్మరణం
- మరో యువకుడి పరిస్థితి విషమం


విలపిస్తున్న హరితారెడ్డి తల్లిదండ్రులు


తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డి, మృతిచెందిన హరితారెడ్డిల ఫైల్‌ఫొటో

శ్రీకాళహస్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల చదువు కోసం పట్టణానికి వచ్చారు. వారి ఉన్నతిని చూసి పొంగిపోయారు. ఇంతలో వారి ఆశలు ఆవిరయ్యాయి. అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తికి చెందిన హరితారెడ్డి(27), శివ(30), మృతిచెందగా.. సాయితేజారెడ్డి (31) తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఓజిలికి చెందిన వీరి మిత్రుడు గోపి (30) కూడా అసువులు బాశారు.

తొట్టంబేడు మండలం చిట్టత్తూరుకు చెందిన ఉపాధ్యాయుడు డేగపూడి భాస్కర్ రెడ్డి, లత దంపతులు శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మకాలనీలో స్థిరపడ్డారు. వీరికి హరితరెడ్డి(27), తేజ కుమార్తెలు. కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి చెందిన రైతు చెన్ను బ్రహ్మానందరెడ్డి, సుగుణమ్మ దంపతులూ బంగారమ్మ కాలనీలోనే ఉంటున్నారు. వీరికి కుమార్తెతో పాటు కుమారుడు చెన్ను సాయితేజారెడ్డి(31) ఉన్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య బంధుత్వం కూడా ఉండటంతో 2022 ఫిబ్రవరి 11న సాయితేజారెడ్డి, హరితారెడ్డికి వివాహమైంది. భార్యతో కలిసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన సాయితేజారెడ్డి అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. హరితారెడ్డి చెల్లెలి వివాహం కోసం ఆరునెలల క్రితం వచ్చి వెళ్లారు. మరో ఏడాదిలో ఉద్యోగానికి స్వస్తి చెప్పి శ్రీకాళహస్తిలోనే స్థిరపడాలని భావించేవారు. వీరిలాగే తొట్టంబేడు మండలం చిన్నకనపర్తి గ్రామానికి చెందిన న్యాయవాది రాజినేని రమేష్‌బాబు, శివకుమారి దంపతులు తమ పిల్లల కోసం శ్రీకాళహస్తిలోని దక్షిణ కైలాసనగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి శివ(30), లోకేష్ కుమారులు. శివ రెండేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందారు. చిన్నకుమారుడు లోకేష్‌కు విశాఖలో మెడిసిన్ సీటు రావడంతో రమేష్ నాయుడు దంపతులు వైజాగ్‌కు నివాసం మార్చారు. అమెరికాలో ఒకే చోట పనిచేస్తున్న సాయితేజరెడ్డి, శివకు ఓజిలి మండలం రాజుపాళేనికి చెందిన తిరుమూరు గోపి కూడా మిత్రులయ్యారు. ఒకే ప్రాంతానికి చెందిన వీరంతా సెలవురోజుల్లో కలిసి సంతోషంగా గడిపేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయితేజరెడ్డి, హరితారెడ్డి దంపతులతో పాటు శివ, గోపి కారులో విహారానికి వెళ్లారు. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 6.45 గంటలకు తిరుగు ప్రయాణంలో.. దక్షిణ బాన్‌హోంకు ఆరుమైళ్ల దూరంలో వస్తుండగా వీరి కారు, మారో కారు ఢీకొన్నాయి. అవతలి కారులో ఉన్నఇద్దరు భారతీయ మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. వీరి కారులో మంటలు వ్యాపించడంతో హరితారెడ్డి, శివ, గోపి అక్కడిక్కడక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారంతో మృతుల కుటుంబాలు తల్లడిల్లాయి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయితేజారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని తానా సభ్యులకు ఫోను చేసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. మృతదేహాలను సకాలంలో స్వగ్రామాలకు తరలించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాజుపాళెంలో విషాదం

ఓజిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమెరికా ప్రమాదంలో ఓజిలి మండలం రాజుపాళేనికి చెందిన తిరుమూరు గోపి మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. గోపికి 2021 మేనెల 5న నెల్లూరుకు చెందిన అపర్ణతో వివాహం జరిగింది. ఈమె ప్రస్తుతం నెల్లూరులోనే ఉన్నారు. ఈ నెల 27న భర్త వద్దకు వెళ్లేందుకు అన్నీ సిద్ధం చేసుకుని ఉన్నట్లు గోపి తలిదండ్రులు తెలిపారు. కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన గోపి తలిదండ్రులు రవీంద్ర, సుదర్శనమ్మ 25 ఏళ్ళ కిందట రాజుపాళెంకు వచ్చి హోటల్ వ్యాపారంలో స్థిరపడ్డారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడిన కొడుకు మృతి చెందటంతో తల్లడిల్లిపోతున్నారు. మృతదేహం వచ్చేందుకు మరో మూడు, నాలుగు రోజులు పడుతుందని బంధువులు తెలిపారు.


గోపి (ఫైల్‌ఫొటో)

రుయాలో పాలియేటివ్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వృద్ధులకు, క్యాన్సర్ బాధితులకు ఇంటి వాతావరణాన్ని తలపించేలా చక్కటి సదుపాయాలతో రుయాస్పత్రిలో పాలియేటివ్(ఉపశమన సంరక్షణ) కేంద్రాన్ని సూపరింటెండెంట్ రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్‌లు బుధవారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వృద్ధులకు, క్యాన్సర్ బాధితులకు ప్రత్యేక వైద్యంతో పాటు వారికి ఏ విధమైన వైద్య సహాయం, ఆహారం అందించాలనే దానిపై సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆలోచన మంచిదే అయినా ఈ కేంద్రాన్ని శిథిల భవనంలో ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రారంభించిన రోజునే చిన్నపాటి వర్షానికి స్లాబు ఉరుస్తుండడంతో గదుల్లోకి నీరు చేరింది. దీంతో ప్రారంభించేందుకు వచ్చిన నిర్వాహకులు సైతం అవాక్కయ్యారు. ఇందులో వృద్ధులను, క్యాన్సర్ బాధితులను ఉంచి వైద్యం అందిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, పునరాలోచన చేయాలని అధికారులను ఆదేశించారు.





విద్యార్థుల వాణి

- మంగళపల్లి హైస్కూల్‌లో మాస పత్రిక నిర్వహణ
- 2018 నుంచి 'మంగళ విద్యావాణి' పేరిట ప్రచురణ
- మ్యాథ్స్ టీచర్ అరుణ శివప్రసాద్ ప్రయోగం
- ప్రతి నెలా విద్యార్థులకు 200 కాపీలు ఉచితం



28వ సంచికను ఆవిష్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

బంగారుపాళ్యం మండలం మంగళపల్లి హైస్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడు మాస పత్రికను నిర్వహిస్తున్నారు. అక్కడి ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులే ఈ మ్యాగజైన్‌కు కథనాలు రాస్తున్నారు. అక్కడి లెక్కల టీచర్ అరుణ శివప్రసాద్ మ్యాగజైన్‌ను సిద్ధం చేసి ప్రతి నెలా 200 కాపీలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఎంతోమంది వీఐపీలు మ్యాగజైన్ గురించి తెలుసుకుని పాఠశాలను సందర్శిస్తున్నారు. మ్యాగజైన్ ప్రచురణకు సాయపడుతున్నారు.

టీచర్ అరుణ శివప్రసాద్ గణిత అవధానాలను నిర్వహించేవారు. అరగొండ హైస్కూల్‌లో ఉన్నప్పుడు గణితోపనిషత్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు లెక్కలపై భయాన్ని పోగొట్టేలా మెలకువలు నేర్పించేవారు.జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కూడా పెంపొందించేవారు.2017 ఆగస్టు నెలలో మంగళపల్లికి ఆయన బదిలీపై వచ్చారు. 2018 జూన్‌లో మ్యాథ్స్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించి వేద గణితంలో మెలకువల్ని విద్యార్థులకు నేర్పించారు. విద్యార్థులతో గణిత అవధానం నిర్వహించారు.

2018 సెప్టెంబరులో 'మంగళ విద్యావాణి' అనే మాస పత్రికను సొంత ఖర్చుతో ప్రారంభించారు.తొలి నాలుగు నెలలు 8 పేజీలు, ఆ తర్వాత 12 పేజీలు.. ప్రస్తుతం 16 పేజీలతో నడుస్తోంది. ప్రత్యేక సందర్భాల్లో 20, 24 పేజీలతో కూడా సంచికను వెలువరించారు.ఈ పత్రికలో పేజీలన్నీ విద్యార్థులే నింపుతున్నారు. టీచర్స్ డే, ఉమెన్స్ డే, సైన్సు డే, మ్యాథ్స్ డే, ఎన్విరాన్‌మెంట్ డే, ఓజోన్ డే, ఇంజనీర్స్ డే వంటి ప్రత్యేక రోజుల గురించి ఇతర మాధ్యమాల ద్వారా అవగాహన చేసుకుని స్వతహాగా రచనలు చేస్తున్నారు.ఒలింపిక్స్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటు.. మంత్రులు- వారి శాఖలు, సైంటిస్టుల చరిత్ర, పజిల్స్, కవితలు రాస్తున్నారు. చిత్రలేఖనం కోసం ప్రత్యేక పేజీని కేటాయించి ప్రోత్సహిస్తున్నారు. చివరి పేజీలో పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థుల వివరాలను ప్రచురిస్తున్నారు. వారి కథనం పక్కన విద్యార్థి పేరు, ఫొటో కూడా ప్రచురిస్తుండడంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతోంది. వారి తల్లిదండ్రులు కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారు. 2019లో అరుణ శివప్రసాద్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధాయుడిగా అవార్డు అందుకున్నారు.

దాతల సహకారం

మంగళ విద్యావాణి మాస పత్రిక తొలి సంచికను వ్యవస్థాపకులు అరుణ శివప్రసాద్ సొంత ఖర్చుతో ప్రారంభించారు. ఆ తర్వాత మూడు నెలలు తోటి ఉపాధ్యాయులు సహకరించారు. 18వ సంచికను అమెరికాలో ఉంటున్న శివప్రసాద్ స్నేహితుడు పార్థసారథి సహకారంతో గణిత ప్రత్యేక సంచికగా 5వేల కాపీలతో వెలువరించారు.బంగారుపాళ్యం మండలంలోని పాఠశాల విద్యార్థులందరికీ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు విద్యార్థులకు కాపీలను ఉచితంగా అందించారు. ఆంధ్రా యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ దండాల రాధాకృష్ణారెడ్డి పాఠశాలను సందర్శించి ఓ సంచికకు దాతగా వ్యవహరించారు. అప్పటి ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రమణ్యం, శ్రీనివాస రెడ్డి పాఠశాలకు వచ్చి మ్యాగజైన్‌ను రిలీజ్ చేసి అభినందించారు. ఈ మ్యాగజైన్‌లో వారిద్దరూ ప్రత్యేక వ్యాసాలు కూడా రాశారు.

- ఇటీవల పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ 27వ సంచికను విడుదల చేశారు. ఎమ్మెల్యేతో వచ్చి మ్యాగజైన్ పట్ల ఆకర్షితులైన అదే మండలం నలగాంపల్లెకు చెందిన ఎన్‌పీ ధరణీ ప్రసాద్ ఒక ఏడాది ఖర్చంతా భరిస్తానంటూ ముందుకొచ్చారు.



విద్యార్థుల ప్రతిభ మెరుగుపరిచేందుకే

విద్యార్థుల రచనా, పఠనా శక్తిని పెంచడానికి వారితోనే వారికి ఉపయోగపడే సమాచారంతో పత్రికను రూపొందించాలని భావించా. నాకు రాసే ఆలోచన ఉన్నప్పటికీ రాయలేకపోయా. నా ద్వారా విద్యార్థులకు ఈ అవకాశాన్ని అందించగలుగుతున్నా. ఈ మధ్యకాలంలో చాలామంది విద్యార్థులు చదవడం తగ్గించేశారు. రచనా శక్తిని మెరుగుపరచుకోవడం లేదు. పాఠశాలలోనే మాస పత్రికను రూపొందించడం వల్ల విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న కళను ప్రోత్సహించవచ్చు. 2018 సెప్టెంబరు నుంచి ఈ మాసపత్రికను తోటి ఉపాధ్యాయుల సహకారంతో ప్రారంభించి ప్రతి నెలా విడుదల చేస్తున్నా. కరోనా సమయంలో మాత్రమే బ్రేక్ వచ్చింది.

- అరుణ శివప్రసాద్



విద్యార్థుల చిత్రలేఖనం, మ్యాగజైన్‌లో మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రాసిన కథనం



పత్రికను కొనసాగిస్తాం

ఏడాది కాలంగా ఇక్కడ హెచ్ఎంగా పనిచేస్తున్నా. 2002 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా. ఎక్కడా ఇలాంటి మ్యాగజైన్ చూడలేదు. దీన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నాం. శివప్రసాద్ బదిలీ అయితే కూడా ఈ మ్యాగజైన్‌ను కొనసాగిస్తాం.

-రాజ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు



గణితంపై ఆసక్తి పెరిగింది

మ్యాగజైన్‌లో వ్యాసాలు రాయడంతో నాకు గణితంపై ఆసక్తి పెరిగింది. గణితంలో అవధానం చేశా. గణిత ప్రజ్ఞాధారణ ద్వారా వంద రెండంకెల సంఖ్యలను గుర్తు పెట్టుకుని 25 చోట్ల కార్యక్రమాలు చేశా. రచనా సామర్థ్యాన్ని పెంచుకున్నా. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడానికి కారణం ఈ పుస్తకమే.

- పునీత్‌సాయి, 10వ తరగతి విద్యార్థి



అనేకసార్లు నగదు బహుమతి

నేను ఆరో తరగతిలో ఇక్కడ చేరినప్పుడే ఈ మ్యాగజైన్ ఉంది. పాఠశాలలో అందరి కంటే ఎక్కువ వ్యాసాలు తెలుగు, హిందీ, ఇంగ్లీషులో రాశా. దీంతో అనేకసార్లు జిల్లాస్థాయి పోటీల్లో నగదు బహుమతి పొందా. గణిత ప్రజ్ఞాధారణ ద్వారా వంద రెండంకెల సంఖ్యలను గుర్తు పెట్టుకుని 25 చోట్ల కార్యక్రమాలు చేశా. స్కూల్‌లో ఏ కార్యక్రమం జరిగినా యాంకర్‌గా నన్నే ఎంపిక చేస్తున్నారు.

- హేమ, 10వ తరగతి విద్యార్థిని

'పీఎం-శ్రీ' కింద ఎంపికైన 40 పాఠశాలల అభివృద్ధి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకం కింద రెండు విడతల్లో ఎంపికైన 40 పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, హెచ్‌ఎంలు, ఎంఈవోలతో కలెక్టర్ సమీక్షించారు.తొలి విడతలో ఎంపికైన 30 పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధి, ప్రయోగశాలల అభివృద్ధి, పనులకు సంబంధించి నాణ్యతతో సివిల్ వర్క్స్ పూర్తిచేయాలన్నారు. బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని,ఆర్వో ప్లాంట్‌ను వాడుకలోకి తీసుకురావాలని చెప్పారు. సెట్విన్ సంస్థ యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణాలకు ఉపాధి నిధులు వినియోగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డిని ఆదేశించారు.డీవైఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

49మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 49 మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్ కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు, వారి సహాయకులకు రూ.3 వేల చొప్పున ప్రభుత్వం జీతం చెల్లిస్తోంది. కాగా సెప్టెంబరు నెలలో నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 49మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీచేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

మళ్లీ పులిచెర్లలోకి ఏనుగుల గుంపు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా, వరి పంటలు

కల్లూరు, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో రెండు నెలలుగా పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు మంగళవారం వేకువజామున మండలాన్ని వీడడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే పీలేరు వైపు వెళ్లిన ఏనుగుల గుంపు మండలంలోని బందార్లపల్లికి చెందిన రైతు రాజారెడ్డిని తొండంతో కొట్టి చంపేయడంతో మండల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పీలేరు మండలంలోని రైతును చంపేసి పగలంతా అక్కడే తిష్టవేసిన ఏనుగులు మంగళవారం రాత్రి పులిచెర్ల మండలంలోకి చేరుకున్నాయి. బుధవారం ఉదయం మతుకువారిపల్లి పంచాయతీ మేకలవారిపల్లి సమీపంలో రైతు యర్రయ్యకు చెందిన అర ఎకరా టమోటా, అర ఎకరా వరిపంటను ధ్వంసం చేశాయి. 16 ఏనుగుల గుంపును గమనించిన గ్రామస్తులు కేకలు వేయడంతో మతుకువారిపల్లి, చల్లావారిపల్లి మీదుగా గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నాయి. ఈ ఏనుగులు బుధవారం రాత్రికి తిరిగి కల్లూరు మీదుగా తూర్పు అటవీ విభాగంలోని పాళెం పంచాయతీలోకి చేరుకునే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గోగులమ్మ వంక వద్ద ఏనుగుల గుంపు సేదతీరుతున్నట్లు పశ్చిమ అటవీ విభాగం ఎఫ్‌బీఓ శ్రీదేవి తెలిపారు.

యాదమరి ఎంపీపీ అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన ఎంపీపీ సురేష్‌బాబు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ప్రచారంలో టపాసులు కాల్చడంతో నిప్పు రవ్వలు ఎగిసిపడి ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన ఘటనలో యాదమరి ఎంపీపీ సురేష్ బాబును పోలీసులు అరెస్టు చేశారు. అతడితో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు... గత ఎన్నికల సందర్భంగా వైసీపీ తరపున గాయత్రి నగర్ వద్ద అప్పటి వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదమరి ఎంపీపీ సురేష్‌బాబుతో పాటు యాదమరి మండలం మాధవరానికి చెందిన శివకుమార్, రమేష్, మురళీ, చిన్నలు కలిసి జిల్లా ఎలక్ట్రికల్ స్టోర్ సమీపంలో టపాసులు కాల్చారు. భారీ ఎత్తున టపాసులకు నిప్పంటించడంతో నిప్పు రవ్వలు ఎగిసి ఎలక్ట్రికల్ గోడౌన్‌లో పడ్డాయి. దీంతో గోడౌన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌లకు వాడే రూ.14,98,600 విలువచేసే అల్యూమినియం వైర్లు, మీటర్లు, ఇతర వస్తువులు కాలిపోయాయి. అప్పట్లో విద్యుత్‌శాఖ డీఈఈ జయప్రకాష్ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారించిన పోలీసులు బాధ్యులైన యాదమరి ఎంపీపీతోపాటు మరో నలుగురిని మంగళవారం రాత్రి అరెస్టు చేసి చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు.

నా భర్త నుంచి రక్షణ కల్పించండి



చిత్తూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తన భర్త నుంచి తనకు, తన కుమారుడికి రక్షణ కల్పించాలని చిత్తూరులోని మురకంబట్టు కొత్తూరుకు చెందిన రోజా కోరారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన పట్టాభితో 13 సంవత్సరాల క్రితం నాకు పెళ్లి జరిగింది.మాకు 12 సంవత్సరాల కొడుకున్నాడు. వివాహమైనప్పటి నుంచి నా భర్త నన్ను అనుమానిస్తూ, మానసికంగా హింసించేవాడు. కొడుకు కోసం ఎన్నో భరించాను, కానీ అతడి ప్రవర్తనలో మార్పురాలేదు. ఈ విషయం మా అమ్మానాన్నలకు చెప్పినా పట్టించుకోలేదు. ఈ ఏడాది మే నెలలో నన్ను నా భర్త కొట్టి ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. వేరే మార్గంలేక బెంగళూరు వెళ్లిపోయి మా చెల్లెలి ఇంట్లో తలదాచుకున్నా. జూన్ 21వ తేది విడాకుల కోసం దరఖాస్తు చేశా. దీంతో రెండు నెలల క్రితం నా భర్త నన్ను ఎవరో కిడ్నాప్ చేశారని చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేను స్టేషన్‌కు వెళ్లి నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఎస్‌ఐకి స్టేట్‌మెంట్ ఇచ్చా. అయితే స్టేషన్ వద్దే నా భర్త చంపుతానని బెదిరించాడు. నన్ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే మా ఊరికి చెందిన రైల్వే కానిస్టేబుల్ జ్ఞానశేఖర్‌ను ఇందులో ఇరికిస్తున్నాడు. అతనికి నాకు ఎలాంటి సంబంధం లేదు. నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదు' అని చెప్పారు.

కార్ల ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు



శాంతిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డు సమీపంలో బుధవారం రెండు కార్లు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు ...అరగొండకు చెందిన మురళి, రాజేశ్వరి దంపతులు తమ కుమారుడు భగవంత్‌ను కుప్పం పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేర్పించేందుకు కారులో బయలుదేరారు. కుప్పం వైపు నుంచి మరో వ్యక్తి కారులో వి.కోట వైపు వస్తున్నాడు. మార్గ మధ్యంలో తుమ్మిశిరోడ్ వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మురళి, రాజేశ్వరి, భగవంత్‌తోపాటు మరో కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనం ద్వారా కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక లాంఛనాలతో సుబేదార్‌కు కన్నీటివీడ్కోలు



అల్తాఫ్ (ఫైల్ ఫొటో)



అల్తాఫ్ మృతదేహానికి కెప్టెన్ రాథోడ్ నివాళులు

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన ఎస్.అల్తాఫ్ (47) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందడంతో బుధవారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాక్‌లోని ముద్ ప్రాంతంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఎస్.అల్తాఫ్ 15 రోజుల క్రితం అనారోగ్యంతో ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చేరాడు.చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈయన మృతదేహాన్ని ఢిల్లీ నుంచి మిలిటరీ ప్రత్యేక వాహనంలో బుధవారం కల్లూరుకు తీసుకొచ్చారు. కెప్టెన్ రాథోడ్, ఎన్‌సీసీ సిబ్బంది అల్తాఫ్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.



కార్వేటినగరం మండలం కొల్లాగుంట సమీపంలో ఆందోళన - కార్వేటినగరంలోని శివాలయం వీధిలో నిరసన - చిత్తూరు గిరింపేట సర్కిల్లో మహిళల ధర్నా

మాకొద్దీ మద్యంషాపు

మూడు ప్రాంతాల్లో జనం నిరసన

వెదురుకుప్పం/చిత్తూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు తమ ఊరిలో వద్దే వద్దంటూ బుధవారం మూడు చోట్ల జనం నిరసన వ్యక్తం చేశారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంట సమీపంలో మద్యం దుకాణం ప్రారంభానికి అవసరమైన స్టాకు కూడా బుధవారం నిర్వాహకులు తెచ్చుకున్నారు. ఆ సమాచారం తెలుసుకున్న స్థానికులు తమ గ్రామంలో మద్యం దుకాణం పెట్టరాదని వర్షం పడుతున్నా లెక్క చేయకుండా గొడుగులతో నిరసన వ్యక్తం చేశారు.దీంతో నిర్వాహకులు అక్కడినుంచి తాత్కాలికంగా నిష్క్రమించారు. అలాగే కార్వేటినగరంలోని శివాలయం వీధి చివరిలో మద్యం దుకాణం వద్దంటూ స్థానికులు అడ్డుపడ్డారు.గతంలో ఇక్కడ మద్యం దుకాణం వుండడంతో ఇబ్బంది పడ్డామని, మరోసారి ఇబ్బందులు పడదలుచుకోలేదని తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అక్కడ మద్యం దుకాణం ప్రారంభించకూడదని స్థానికులు సీఐకి వినతిపత్రం ఇచ్చారు.ఈ మద్యం దుకాణాన్ని స్థానికేతరులు దక్కించుకోవడంతోనే ఈ అభ్యంతరాలు వ్యక్తమైనట్లు మరోవైపు ప్రచారం జరుగుతోంది. కాగా చిత్తూరులోని గిరింపేట సర్కిల్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ తెలుగుమహిళలు ఆందోళనకు దిగారు.స్థానిక మహిళలతో నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు వరలక్ష్మి కలసి మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ ధర్నా చేశారు. మహిళలు, విద్యార్థులు ఎక్కువగా తిరిగే తమ వీధిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని డిమాండు చేశారు.పోలీసులు ధర్నా చేస్తున్న మహిళలను అరెస్టుచేసి అనంతరం విడిచిపెట్టారు.

దేవతామూర్తుల ఊరేగింపు



సాయిబాబా ఊరేగింపులో కోలాట బృందం

సోమల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) సోమల మండలం పెద్దఉప్పరపల్లె పంచాయతీ నాగిళ్ల వారిపల్లెలో నూతన వరసిద్ధి వినాయకస్వామి, సద్గురు సాయిబాబా, షణ్ముగ సుబ్రమణ్య స్వామి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మూలవిరాట్‌లను పురవీధుల్లో ఊరేగించారు. మహా కుంభాభిషేకం, గణపతి పూజ, స్వస్తి వాచన, ప్రవేశబలి, రక్షాబంధనం, గంగపూజ, అగ్నిప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. 17న వేద పారాయణం, ప్రధాన కలశ ఆరాధన, నవగ్రహ హోమం, గోపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కేఈసీలో ఫుట్‌బాల్ టీమ్ సభ్యుల ఎంపిక



ఎంపికైన ఫుట్‌బాల్ టీంతో ప్రముఖులు

కుప్పం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల ఇంటర్ యూనివర్శిటీ మెన్స్ ఫుట్‌బాల్ టీం సెలక్షన్స్ బుధవారం కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరచూ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సెలక్షన్స్‌లో పోటీ ప్రదర్శించి 16 మంది సభ్యుల టీంలో స్థానం పొందిన కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు డేవిస్, శ్రీహరి విజుకుమార్, అభిలను బీసీ.నాగరాజ్‌తోపాటు కళాశాల వైస్ ఛైర్మన్ సునీల్‌రాజ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ జీఎన్.కోదండరామయ్య, ఫిజికల్ డైరెక్టర్ సి.సతీశ్‌కుమార్, ప్రోగ్రాం ఆర్గనైజర్స్ జె.మాధవన్, ఎం.గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ప్రారంభం

పుంగనూరురూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో బుధవారం ప్రైవేట్ మద్యం షాపుల్లో మందు విక్రయాలు ప్రారంభమయ్యాయి. లాటరీల ద్వారా మద్యం దుకాణాలు పొందిన లైసెన్స్‌దారులు చిత్తూరు నుంచి మద్యం స్టాక్ తెప్పించడం, దుకాణానికి గదులు పూర్తి కాకపోవడంతో మొదటి రోజు కొంత ఆలస్యంగా పూజలు చేసి షాపుల్లో విక్రయాలు ప్రారంభించారు. పుంగనూరులో ఆరు మద్యం దుకాణాలకు గానూ నాలుగు దుకాణాలు ప్రారంభంకాగా మిగిలిన దుకాణాలు గురువారం ప్రారంభ మవుతాయని లైసెన్స్‌దారులు తెలిపారు. ఈ సందర్భంగా పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని 14 మద్యం దుకాణాలకు లైసెన్స్‌దారులు షాపులు పెడుతున్నారని, కొన్నిచోట్ల స్టాక్ రావడం ఆలస్యం కావడం, గదుల సమస్యతో గురు వారం నాటికి పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పెద్దపంజాణి మండలాల్లో పూర్తిస్థాయిలో మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయన్నారు.

చౌడేపల్లె : చౌడేపల్లె మండలంలో ఒక మద్యం దుకాణం బుధవారం ప్రారంభమైంది. మండలంలో 3 మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు షాపులు ఏర్పాట్లలో నిమగ్నం కావటంతో ఉదయం నుంచి మందుబాబులకు మద్యం లభించలేదు. షాపును దక్కించుకున్న ఇంద్ర ప్రకాష్ మద్యం దుకాణం మాత్రం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది.

ఎడతెరపిలేని ముసురుతో ఇబ్బందులు

పుంగనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాన్ కారణంగా బుధవారం పుంగనూరు పట్టణ, మండలంలో బుధవారం వర్షం కురిసింది. రెండురోజులుగా చిరుజల్లులు కురుస్తుండగా ప్రజల జీవనానికి ఇబ్బంది కలిగింది. తుపాన్ కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా తహసీల్దార్ రాము, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ ఏడీఈ శ్రీనివాసులు ఆయా శాఖల సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చి పరిస్థితిని పర్యవేక్షించారు. పంటలకు ఇప్పటివరకు ఇబ్బంది లేదని, టమోటా, పూలు, కూరగాయల తోటల్లో వర్షం నీరు రాకుండా పొలాల నుంచి రైతులు పంపివేయాలని సూచించారు. ఇక వర్షం కురిస్తే టమోటా, ఇతర పంటలకు నల్లమచ్చలు రావచ్చునని, పూలు నల్లగా మారిపోతాయని హార్టికల్చర్ అధికారిణి సంతోషికుమారి తెలిపారు.

సదుం : తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరపిలేని ముసురు వానతో సదుంలో జనజీవనం స్తంభించింది. టమోటా, వరి, బొప్పాయి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్షం కారణంగా చిన్నపాటి కుంటలు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఇంకో రెండు, మూడు రోజులు ఇలాగే వర్షం కురిస్తే కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు కాలువ పనుల ప్రారంభం

బైరెడ్డిపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూరునత్తం ఎస్సీకాలనీలో మురుగు కాలువ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ కాలువ నిర్మాణానికి సంబంధించి జరిగిన భూమిపూజలో పాల్గొని ప్రభుత్వం ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ గౌరప్పగౌడు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యంగౌడు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల శబరిమలై యాత్ర

బైరెడ్డి పల్లె,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెకు చెందిన అయ్యప్పభక్తులు పలువురు బుధవారం శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. కొన్నిరోజులుగా అయ్యప్ప మాల ధరించి దీక్షలోవున్న భక్తులు స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఇరుముళ్లు కట్టుకుని వాహనాల్లో శబరిమలైకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు.

ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలి

పుంగనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని పుంగనూరు డిపో మేనేజర్ కె.సుధాకరయ్య తెలిపారు. బుధవారం ఆర్టీసీ గ్యారేజీలో ఆర్టీసీ ఆదాయం చేకూర్చడం, డీజల్ ఆదా చేసిన డ్రైవర్లు, కండెక్టర్లను అభినందించి నగదు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిపోలో అత్యధికంగా హెచ్ఎస్‌డీ ఆయిల్ పొదుపు చేసిన డ్రైవర్లు ఎన్‌సీ.రామనాథ, ఎస్.ఫైరోజ్‌బాషా, అత్యధికంగా ఈపీకే ఆదాయం సాధించిన ఎక్స్‌ప్రెస్ కండెక్టర్ టి.శేషాద్రి, పల్లెవెలుగు కండెక్టర్ ఆర్.పార్వతమ్మలను డీఎం అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ కె.సంధ్య, గ్యారేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



పుంగనూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచలేశ్వరుడి దర్శనం, గిరిప్రదక్షణకు పుంగనూరు నుంచి బయలుదేరిన భక్తులకు స్థానిక టీడీపీ నాయకుడు రాఘవ, బీజేపీ నాయకుడు కుమార్‌లు అన్నదానం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు వెళుతుండగా భక్తులకు అన్నం ప్యాకెట్లు, నీటి వసతి కల్పించారు.

గ్రామపాలనపై అవగాహన ఉండాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పాలనపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులు అవగాహన కలిగిఉండాలని ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యుల శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలు ఆర్థికంగా పటిష్ఠంగా ఉంటూ అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు సూచనలు ఇవ్వాలని వివరించారు. గ్రామపంచాయతీ సమావేశాల్లో సమస్యలు తెలియజేయడం, ఆర్థిక వనరుల పెంపు, ప్రభుత్వ గ్రాంట్లు ద్వారా చేపట్టాల్సిన పనులు గురించి చర్చించాలన్నారు. వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌ల విధులు, బాధ్యతల గురించి డీఆర్పీలు శ్రీనివాసులరెడ్డి, బసవరాజులు శిక్షణ ఇచ్చారు.

మద్యం కోసం ఎదురు చూపులు

సోమల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ మద్యం షాపులు బుధవారం నుంచి అమల్లోకి రావడంతో ఆ షాపులు ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియక మద్యం ప్రియులు ఎదురు చూశారు. బుధవారం మధ్యాహ్నం వరకు కొత్త షాపుల సమాచారం తెలియక తికమక పడ్డారు. ఎట్టకేలకు తిరుపతి రోడ్డులో కొత్త షాపునకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలుసుకుని అక్కడికి పరుగులు తీశారు.

నేడు వాల్మీకి జయంతి

కుప్పం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కుప్పంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. కుప్పంలో ఉన్న వాల్మీకి సంక్షేమ భవనంలో ఉదయం 9 గంటలకు వాల్మీకి చిత్రపటానికి పూజ, అభిషేకం చేస్తామన్నారు. ఉదయం 10.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు కూడలిలో నిర్వహించే వాల్మీకి జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం హాజరవుతారని చెప్పారు.

మత్స్య సహకార సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



కల్లూరు, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ పెద్దబెస్తపల్లిలో బుధవారం సహాయ మత్స్య సంచాలకులు రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర మత్స్య సహకారం సంఘం ఎన్నికలు నిర్వహించగా అన్ని పదవులు ఏకగ్రీవమయ్యాయి. సంఘం ప్రెసిడెంట్‌గా యర్రయ్య, ఉపాధ్యక్షుడిగా మునేంద్ర, కార్యదర్శిగా జయకుమార్, డైరెక్టర్లుగా హేమాద్రి, కాంతారావు, యర్రయ్య, లింగమూర్తి, మల్లికార్జున, నాగేంద్ర ఎన్నికైనట్లు రవికుమార్ తెలిపారు. ఎఫ్‌డీఓ రామ్మోహన్, గ్రామ మత్స్య సహాయకురాలు జయంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన చెట్టు



రొంపిచెర్ల,అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గానుగచింత రోడ్డు మార్గంలో మిట్టమీదపల్లె వద్ద మంగళవారం రాత్రి చెట్టు కూలింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పండింది. గ్రామస్తులు చెట్టు కొమ్మలు తొలగించి చిన్న వాహనాలు వెళ్లేందుకు సౌకర్యం కల్పించారు. అలాగే పెద్దమల్లెల గ్రామం పాతపేటలో రోడ్డు వర్షాలకు నీటిమునిగింది. తహసీల్దార్ కిరణ్‌కుమార్ జేసీబీ సాయంతో కాలువ తీయించి నీటి తొలగింపు చర్యలు తీసుకున్నారు, గర్నిమిట్టవారిపల్లె వాసులను పునరావాసానికి తరలించామని తెలిపారు. వీరికి తక్షణసాయంగా ఐదు కేజీలు బియ్యం, కందిపప్పు ఇవ్వాలని వీఆర్వోకు తెలిపామని చెప్పారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

రొంపిచెర్ల,అక్టోబరు16: (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 11 పంచాయతీలకు సంబంధించిన ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు రెండవ రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పరిపాలన, అభివృద్ధి పనులు, పారిశుధ్యం తదితర అంశాలపై వివరించారు. రీసోర్సు పర్సన్స్‌గా హరిబాబు, సత్యంరెడ్డి పాల్గొన్నారు.

అర్బన్ ఆరోగ్య కేంద్రం తనిఖీ



పలమనేరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు బుధవారం పలమనేరు కాకాతోపు అర్బన్ ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. స్టాకులో పేర్కొన్న మేర వ్యాక్సిన్లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. తర్వాత ఎద్దుల సంత వీధిలో ఉన్న సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీచేశారు. అటుపిమ్మట స్థానిక ప్రైవేటు ఆరోగ్య క్లినిక్‌ను సందర్శించి డీఎంఅండ్ హెచ్ఓ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నిరంజన్, ఆశ, సబ్‌యూనిట్ అదికారి జయశంకర్ పాల్గొన్నారు.

పంట నష్ట నివారణపై అవగాహన

సదుం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో జరిగే పంట నష్టాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. కోతకొచ్చిన మామిడి కాయలను కోసుకోవాలని, టమోటా పంట నీళ్లలో నానకుండా మొక్కకు ఊతం అందించి, దోరగా ఉన్న కాయలను పూర్తిగా కోసేసి ఇళ్లకు చేర్చుకుని గాలి తగిలేలా పెట్టుకుని మార్కెట్టుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసాద్, ఉద్యానశాఖ అధికారిణి సంతోషి కుమారి పాల్గొన్నారు

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

పుంగనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం సుధాకరయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కేంద్ర కార్యాలయం ఆదేశాలతో 17వ తేది ఉదయం జరిగే కార్యక్రమంలో ప్రజలు సలహాలు, సూచనలు, ఫిర్యాదులను మొబైల్ నెంబరుకు 9100941850కు ఫోన్ చేయాలని ఆయన వివరించారు.

ఆహారభద్రతపై అవగాహన

బైరెడ్డిపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహారభద్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం దాసార్లపల్లెలో తీర్థం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆహార భద్రత గురించి అవగాహన కల్పించారు. ఆహారాన్ని వృథా చేయకూడదని, ఆరోగ్యమే మహాభాగ్యం కనుక ఆరోగ్యసంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నవీన, ఏఎన్ఎం కవిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పంలో ట్రాఫిక్ అస్తవ్యస్తం



రామకుప్పం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : పట్టణం తరచూ ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంటోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి విస్తరణ పేరిట ప్రతిసారీ మార్కింగ్ ఇస్తారు. కానీ కొందరు రాజకీయ నేతల రహదారి విస్తరణకు మోకాలడ్డటం పరిపాటిగా మారింది. ఈ విషయంలో అధికార, విపక్ష నేతలు ఏకతాటిపై నిలుస్తారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పలమనేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రోజా అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో వుండాలన్నారు. భారీ వర్షాల సమయంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు ఎటువంటి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యలోపం లేకుండా చూస్తే ప్రజలు రోగాల బారిన పడకుండా వుంటారని పేర్కొన్నారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు నత్తల నివారణ చేసుకోవాలని, గాలికుంటువ్యాధి సోకకుండా టీకాలు వేసుకోవాలన్నారు. మండలంలో 340 ఎకరాల్లో వరిసాగు వుందని, మరో రెండురోజుల్లో రైతులకు ఆర్‌బీకేల నుంచి యూరియా సరఫరా చేస్తామని వ్యవసాయశాఖ అధికారిణి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ రోజా, ఎంపీడీఓ ఖాదర్‌బాషా, డీటీ అనిల్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్‌పై చర్యలు తీసుకోండి

కౌండిన్య నదినుంచి అక్రమంగా ఇసుక తరలించి డంప్‌లు ఏర్పాటు చేసుకున్నారని, వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బాలాజినాయుడు అధికారులకు విన్నవించారు. ఇసుక డంపింగ్‌లపై ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ ఇసుక అక్రమ డంపింగ్‌లకు సంబంధించి సరైన రుజువులతో వస్తే తాను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

పేదరికంలేని సమాజమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం : కంచర్ల



గరిగచీనేపల్లెలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజ నిర్మాణమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు అన్నారు. మండలంలోని గరిగచీనేపల్లెలో బుధవారం పల్లెపండుగ నిర్వహించారు. గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలలో భాగంగా కుప్పం నియోజకవర్గంలోని పాడి రైతులకు గోకులం షెడ్లను నిర్మించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పల్లె పండుగ కార్యక్రమానికి కేవలం కుప్పం నియోజకవర్గానికే రూ.30 కోట్లు కేటాయించడం, ఇక్కడి ప్రజలపై చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఉన్న ప్రేమను సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి లహరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పం మండలం కెంచనబల్ల, సింగసముద్రం గ్రామాల్లో బుధవారం గోకులం షెడ్ల నిర్మాణానికి టీడీపీ నేతలు భూమిపూజలు చేశారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరకు విత్తనాలు, వ్యవసాయ పరికరాలను అందించడమే కాకుండా 90శాతం సబ్సిడీతో బిందుసేద్యం పరికరాలు అందిస్తోందని నేతలు తెలిపారు. పాడిరైతులు కష్టాలను తీర్చేందుకు విరివిగా గోకులం షెడ్లను మంజూరు చేస్తోందన్నారు. ఆయా కార్యక్రమంలో నేతలు సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, రమేష్, రామాంజులు, మురుగేష్, గిరిదాసు, బాలకృష్ణ, హనుమప్ప, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి : గౌనివారి



సొన్నేగానిపల్లెలో మాట్లాడుతున్న గౌనివారి

శాంతిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ బాటలో పయనిస్తుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం శాంతిపురం మండలం సొన్నేగానిపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణ భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ, గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు చలపతి, విజయరామిరెడ్డి, మంజునాథరెడ్డి, బాలు, భాస్కర్, మునిరెడ్డి, ఆంజినేయరెడ్డి, అనసూయ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

సోమల : సోమల పంచాయతీలోని లింగమ్మచెరువు నుంచి డంపింగ్ యార్డు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, అడుసుపల్లెలో రోడ్డు పనులకు టీడీపీ నాయకులతో కలసి అధికారులు బుధవా రం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఏపీవో దినకర్ బాబు, టీడీపీ నాయకులు పీఎం. మల్లి కార్జున, ఎస్. సదాశివయ్య, అడుసుపల్లె సుబ్రమణ్యం, ఎం. వెంకట్రమణ, జేఈలు రెడ్డెప్ప, ఆనంద్, ఎఫ్ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య ఉత్తమోత్తమం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న వైద్య ప్రముఖులు

కుప్పం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య అన్ని విద్యలలోకెల్లా ఉత్తమోత్తమమైనదని బెంగలూరు హెచ్‌సీజీ రోబోటిక్ సర్జరీ, అంకాలజీ శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ విశాల్‌రావు, క్యూటిస్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ బీఎస్.చంద్రశేఖర్, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తిలు అన్నారు. పీఈఎస్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు సహనం, ఓపిక కలిగి ఉండాలని సూచించారు. కోవిడ్ ముందు, తర్వాత వైద్యుల పాత్రలో వచ్చిన మార్పులను వివరించారు. వైద్యవృత్తిలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. 2023-24 బ్యాచ్ విద్యార్థుల్లో డిస్టింక్షన్ సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు, డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, పీఈఎస్ ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ ఎస్‌కే.సుబ్రహ్మణ్య, వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చేయాలి



చామంతి తోటను పరిశీలిస్తున్న అధికారులు

చౌడేపల్లె, అక్టోబర్16(ఆంధ్రజ్యోతి): ఉద్యాన వన పంటల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చేయాలని హార్టికల్చర్ అధికారిణి సంతోషి కుమారి పేర్కొన్నారు. బుధవారం పరికిదోనలో రైతు రమేష్ బాబుకు చెందిన చామంతి తోటను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టమోటా పంటలో మచ్చ తెగుళ్ళు రాకుండా 2.5 గ్రాములు డైత్రెన్‌ఎం-45, ఒక గ్రాము కార్బండిజం ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. చామంతిలో నీరు నిల్వ ఉంటే వేర్లు కుళ్లి పోతాయని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆలాగే కోతకు సిద్ధంగా ఉన్న బొప్పాయిని ముందుగానే కోసి మార్కెట్లో విక్రయించుకోవాలన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సోమల : మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం ఉద్యాన అధికారిణి సంతోషి కుమారి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. టమోటా తోటల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక వర్షాలకు వచ్చే మచ్చ తెగులు రాకుండా ముందస్తుగా 2.5 గ్రాముల డైత్రెన్ ఎం. 45, ఒక గ్రాము కార్బెండిజం లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలని తెలిపారు. బంతి, చామంతి పొలాల్లో నీరు నిలిస్తే వేరు కుళ్లు తెగులు వ్యాపిస్తుందని చెప్పారు.



పశువుల పాకగా బస్ షెల్టర్

పుంగనూరురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : పుంగనూరు మండలం అడవినాథునికుంట గ్రామంలో నిర్మించిన బస్‌షెల్టర్ పశువుల పాకగా మారింది. అడవినాథునికుంటలో ఏపీ మోడల్ స్కూల్, కాలేజీ, సచివాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. వివిధ రకాల పనులపై ప్రజలు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. కానీ ప్రజలు, ప్రయాణికుల కోసం నిర్మించిన బస్‌షెల్టర్‌లో కొందరు పశువులు కట్టేయడం, పరికరాలు పెట్టుకున్నారు. బస్‌షెల్టర్‌కు మరమ్మత్తులు చేసి ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేలా ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్తూరు దిక్కులేని జిల్లాగా మారింది: ఎమ్మెల్యే థామస్



గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో మాట్లాడుతున్న థామస్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి ఉమ్మడి జిల్లా నుంచి విడిపోయి చిత్తూరు జిల్లా కొత్తగా ఏర్పడిందే కాని, ఏమిలేని దిక్కులేని జిల్లాగా మారిందని ఎమ్మెల్యే థామస్ ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్ ప్రభావంపై గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గంగాధరనెల్లూరు, పెనుమూరు, పాలసముద్రం మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన చిత్తూరు జిల్లా విద్యార్థులకు పేరు మోసిన ఒక యూనివర్సిటీ లేదు, ప్రజలకు వైద్యసేవలు అందించడానికి స్విమ్స్, రుయా ఆస్పత్రి వంటివి లేకుండా పోయాయని అన్నారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు తనకు తెలియజేస్తే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమలను ఏర్పాటుచేసి నిరుద్యోగులకు చేయూత అందిస్తానని పేర్కొన్నారు. తుఫాన్ హెచ్చరికల వల్ల నియోజకవర్గంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు వెంకటేష్, స్వామిదాస్, కోదండ రెడ్డి, హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే థామస్ అన్నారు. బుధవారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులంతా స్థానికంగానే ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ భగవతి, టీడీపీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రవియాదవ్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను ప్రభుత్వ భవనాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, తహసీల్దార్ లోకనాథంపిళ్లై, ఇరిగేషన్ అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పాటు మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచన మేరకు కమిషనర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. బుధవారం నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి నీటి ప్రవాహాలను పరిశీలించారు. మేజర్‌కాలువల్లో నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు. పెద్ద పెద్ద కాలువల్లో నీటి ప్రవాహాలకు ఇబ్బందులు లేకుండా ఎక్సకవేటర్ల ద్వారా చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఫుడ్ ఫెస్టివల్



తల్లీబిడ్డల వార్డులో అపోలో నర్సింగ్ ఫుడ్ ఫెస్టివల్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లోకేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని చిల్డ్రన్స్ వార్డులో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్, ఏవో డాక్టర్ రాంగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొని, బాలింతలు, గర్భిణులు, తల్లులతో పాటు పురిటి బిడ్డలు తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ మంజుల, వైద్యాధికారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

కృష్ణాపురం జలాశయాన్ని సందర్శించిన అధికారులు



కృష్ణాపురం జలాశయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయాన్ని బుధవారం అధికార బృందం సందర్శించారు. పలు చెరువులు, గుంటలను పరిశీలించారు. కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ భగవతి, సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్, టీడీపీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ వెళ్లి పరిశీలించారు. వరద ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను నేపథ్యంలో కొందరు చిన్నారులు కృష్ణాపురం జలాశయంలో చేపలు పట్టడానికి వెళ్లారు. వారిని గమనించి పోలీసులు, అధికార బృందం కౌన్సెలింగ్ ఇచ్చారు. తుఫాను వల్ల ప్రమాదం పొంచి ఉందని, క్షేమంగా ఇంటి వద్దనే ఉండాలని చిన్నారులకు చెప్పారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం గిరిరాజ

యాదమరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదమరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అండర్-17 ఫెన్సింగ్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. బుధవారం జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరి వసంతవాణి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారిని ఈనెల 17వ తేదీ నుంచి నంద్యాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. బాలికల విభాగంలో ఫాతిమా ఫిర్దోస్ (జడ్పీహెచ్‌ఎస్ యాదమరి), బాలుర విభాగంలో రెడ్డిప్రసాద్ (ఐరాల ప్రభుత్వ పాఠశాల) మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిరాజ, పీడీలు శెల్వపాండియన్, క్రిష్ణయ్య, బాబు, రవి, కార్తిక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో నిండిన క్రీడామైదానం



చిత్తూరు కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానం గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షపు నీటితో చెరువును తలపిస్తుంది. దీంతో మైదానంలో కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర క్రీడల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో తేలికపాటి వర్షానికి కూడా మైదానం బురదమయం అవుతున్నదని క్రీడాకారులు వాపోతున్నారు. మైదానంలో వాకింగ్, వ్యాయామం చేసే నగరవాసులు ఇబ్బందులకు గురయ్యారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి మైదానంలో వర్షపునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు, విద్యార్థులు, నగర వాసులు కోరుతున్నారు.

భక్తి ప్రపత్తులతో పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో భక్తులు బుధవారం స్వామివారికి పౌర్ణమి గిరి ప్రదక్షిణలు నిర్వహించారు. ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు పూల సుబ్రమణ్యం నాయుడుల ఆధ్వర్యంలో భక్తులు స్వామివారి అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేక అలంకారంలో రథంపై అధిష్ఠింపజేసి సీబీ రోడ్డు, దర్గా, ఎంఎస్‌ఆర్ జంక్షన్, గిరింపేటలో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు దాతలు భక్తులకు అన్న ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేసారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- నేలరాలిన వరి పంట
- చెరువులను తలపిస్తున్న రోడ్లు






పెరుమాళ్లపల్లిలో రైతు గోవిందరెడ్డికి చెందిన నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న జేడీ మురళీకృష్ణ - టీఆర్ కండ్రిగలో నీటమునిగిన మినుముల పంట - ఉగ్రాణంపల్లి సప్తగిరి బ్యాంకు ముందు రోడ్డు దుస్థితి - నగరిలో ఇండియన్ గ్యాస్ బుకింగ్ కౌంటర్ వద్ద వర్షంలోనూ బారులు తీరిన జనం

నగరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల పాటు నియోజకవర్గ పరిధిలో ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. దీంతో నగరి, నగరిపేట ప్రాంతంలో నివాసాల్లోకి వర్షపునీరు ప్రవహించడంతో అక్కడి ప్రజలు అవస్థలకు గురయ్యారు. వీధులు జలమయమయ్యాయి. టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతంలో అంతర్గత రోడ్లు బురదమయమై అక్కడక్కడా గుంటల్లా వర్షపునీరు చేరింది. దీంతో స్థానికులకు ఇబ్బంది తప్పలేదు. తెరణి వద్ద కుశస్థలీ నదిలో కొంత మేరకు నీటి ప్రవాహం కనిపించింది. వరద నీటి కాలువలో మోస్తరుగా నీరు ప్రవహించింది. రోడ్లపై జన సంచారం తగ్గింది. ఇంతటి వర్షంలోనూ గ్యాస్ సిలిండర్లకు మాత్రం తిప్పలు తప్పలేదు. బుధవారం ఓటీపీ సిస్టమ్ తెచ్చిన ఇండియన్ గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీ కార్యాలయం వద్ద వర్షంలోనే గొడుగులు పట్టుకుని మరీ వినియోగదారులు క్యూలో నిలబడాల్సి వచ్చింది. నగరి మండలంలో 77.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

యాదమరిలో నేలరాలిన వరి

యాదమరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండురోజులుగా కురిసిన వర్షాలకు వరి పంట నేలరాలింది. తుఫాన్ ప్రభావంతో గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామానికి చెందిన రైతు గోవిందరెడ్డి తన రెండెకరాల పొలంలో వరిసాగు చేశాడు. పంట చేతి కందే దశలో వర్షాలకు నేలకొరిగి నష్టపోయాడు. బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పంట పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నివేదికను తయారు చేసి పై అధికారులకు పంపారు. కార్యక్రమంలో మండల ఏవో చరిత, పూజ, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు కలియంబాకం వద్ద వరద నీరు వెళ్లడానికి సౌకర్యం లేకపోవడంతో చెరువును తలపిస్తున్న పంట పొలాలు



వర్షానికి ఉరుస్తున్న విజయపురం ఎంపీడీవో కార్యాలయం - నగరిలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు

విజయపురంలో కుంభవృష్టి

విజయపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరపి లేని వర్షం కురవడంతో బుధవారం జన జీవనం పూర్తిగా స్తంభించింది. 50 శాతానికి పైగా చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలోని పాతార్కాడు, ఇళ్ళత్తూరు పెద్దచెరువు, మహావీరాపురం చెరువులు మొరవ పారుతున్నాయి. వరి పంట పొలాలు జలమయమయ్యాయి. చెరకు పంట లోనూ వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు పనుల్లో భాగంగా వర్షపునీరు వెళ్ళడానికి దారి పూడిపోవడంతో కలియంబాకం వద్ద పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మూడు రోజులపాటు కురుస్తున్న వర్షానికి విజయపురం ఎంపీడీవో కార్యాలయం ఉరుస్తుంది.

తుఫాన్‌తో స్తంభించిన జనజీవనం

వెదురుకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షంతో బుధవారం కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో జనజీవనం స్తంభించింది. రోజువారీ కూలీలు పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దే గడపాల్సి వచ్చింది. కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ముఖద్వారం ముందు భాగంలో వర్షపు నీరు నిలిచిపోయింది. వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామ సచివాలయ భవనం లోపల నీరు చేరింది. నూతన సచివాలయ భవన నిర్మాణం పూర్తయినా ఇంకా వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్ల వర్షం వస్తే ప్రస్తుతం ఉన్న భవనం ఉరుస్తోంది.

చెరువును తలపిస్తున్న రోడ్డు

పెనుమూరు, అక్టోబరు 16: చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని ఉగ్రాణంపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు ముందు చిత్తూరు-పెనుమూరు ప్రధాన రహదారే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. గత ప్రభుత్వంలో నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి మధ్యలో ఆపేయడంతో అక్కడక్కడా గుంతలుగా మారాయి. చిన్న వర్షానికే నీరు నిలిచి రోడ్డు కనిపించక ద్విచక్ర వాహనదారులు పడి లేచి వెళుతున్నారు. కనీసం మట్టి అయినా తోలి ఈ గుంతలను అధికారులు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

పాలసముద్రంలో కలెక్టర్ తనిఖీలు



పాలసముద్రం ఎంపీడీవో కార్యాలయం ఎదుట అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పాలసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ భవనం వర్షాలకు ఉరుస్తుందని, గోడలు పగుళ్లిచ్చాయని తహసీల్దార్ అరుణకుమారి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలించి, మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని ఆయన హామీఇచ్చారు. అనంతరం మండల స్థాయి అధికారులతో తుఫాన్ ప్రభావంపై సమీక్షించి, పలు సూచనలిచ్చారు. తర్వాత ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి, వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి, రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, ఈవోపీఆర్‌డీ రమేష్, డాక్టర్ మోహన్‌కృష్ణ, ఎస్.ఐ.భారతి, రెవిన్యూ, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి



నలగాంపల్లెలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగతో గ్రామాల్లో కొత్త సొబగులు సంతరించుకోనున్నట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని తుంబకుప్పం, సదకుప్పం, నలగాంపల్లి, తంబుగానిపల్లి గ్రామపంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌తో కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి సుమారు రూ.5 కోట్లతో త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎంపీడీవో శ్రీధర్, ఏఈ క్రిష్ణ, టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు, ఎన్‌పీ సురేంద్ర నాయుడు, ఎన్‌పీ ధరణీప్రసాద్ నాయుడు, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, జనార్దన్ గౌడ్, కమల్‌నాథరెడ్డి, సర్పంచ్ షీబా స్వామిదాస్, రమేష్, హేమచంద్ర నాయుడు, నాగరాజ్ గౌడ్, లోకనాథ నాయుడు, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న డీటీసీ

చిత్తూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పలమనేరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చేతక్ ఎలక్ట్రికల్ టూ వీలర్ షోరూంను బుధవారం డీటీసీ నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతక్ వెహికల్ ఇండియాలో సాలిడ్ మెటల్ బాడీతో తయారయ్యే మొదటి టూ వీలర్ వెహికల్ అన్నారు. వాహనం వివిధ రంగుల్లో, 5 సంవత్సరాల వారంటీతో పాటు, లైఫ్ టాక్స్ లేదని చెప్పారు. కార్యక్రమంలో కేవీబీ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ, శ్రీనివాస మోటార్స్ అధినేత జీవరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందిని నియమించాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఇన్‌పేషెంట్ల బెడ్లకు తగ్గ శానిటేషన్ సిబ్బందిని నియమించుకోవాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆస్పత్రి ఏపీ మెడికల్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ శాఖ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇన్‌పేషంట్ల సంఖ్య అధికమవుతున్న కారణంగా పనిభారం ఎక్కువైనందున శానిటేషన్ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు చంద్ర, నాయకులు రమాదేవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయేశ్వరాలయ జీర్ణోద్ధరణ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహావీర్ బ్రిడ్జి జీవకారుణ్య అన్నదాన సమాజం అమృత మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, సంప్రోక్షణ కార్యక్రమాలు ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఇటీవల ఎమ్మెల్యే జగన్మోహన్ చొరవతో దేవదాయశాఖ అధికారులు ఆలయం చుట్టూ ఉన్న ముళ్ళ కంపలను తొలగించి శుభ్రం చేశారు. వందల సంవత్సరాల నాటి పురాతన అమృత మృత్యుంజయేశ్వర ఆలయం జీర్ణోద్ధరణ చర్యలు చేపట్టారు. ఆలయంలో గణపతి పూజ, హోమం నిర్వహించి భక్తులచే మహా సంప్రోక్షణ నిర్వహించారు.

నేడు వాల్మీకి జయంతి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అశ్వయుజ పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గురువారం మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పాత గ్రీవెన్స్ హాలులో వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని తెలిపారు.

రోడ్డు పనులకు భూమి పూజ

శ్రీరంగరాజపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎగువ కమ్మకండ్రిగలో సిమెంట్ రోడ్డు పనులకు నియోజకవర్గ టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్, మాజీ సర్పంచ్ కుప్పయ్య బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్, బూత్ కన్వీనర్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ

విజయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సామిరెడ్డి కండ్రిగ, మల్లారెడ్డి కండ్రిగ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ కుంభాభిషేకం

నగరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశూరు, అగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ అష్టబంధన విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఆలయం వద్ద ప్రత్యేక హోమ, కలశ పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి రోజా మూలవిరాట్‌ను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నగరి మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదిరి వీఆర్‌వోగా జోన

నింద్ర, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): పాదిరి వీఆర్‌వోగా జోన బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె కొప్పేడు గ్రామ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పాదిరి వీఆర్వోగా వచ్చారు.

ముగిసిన శిక్షణ

నింద్ర, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లక్ష్మీపతి, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో కొత్తపల్లికి చెందిన ఏపీఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు శ్రీకర్‌రెడ్డి కుమారుడు చరణ్ జన్మదినం సందర్భంగా భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివలింగా రెడ్డి, చల్లా, బాబు, మహదేవ, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్లూరు మఠంలో ఘనంగా పౌర్ణమి పూజలు

గుడిపాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లూరు మఠంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. చిత్తూరు రూరల్ మండలం కొట్టాలం గ్రామానికి చెందిన మునిరత్నం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మూర్తి, రవీంద్రారెడ్డి, పద్మావతి, మునిరత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వెదురుకుప్పం, అక్టోబరు 16: వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి బుధవారం పలు గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికార బృందం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

తవణంపల్లె, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి సూచించారు. బుధవారం మండలంలోని కాణిపాకపట్నం హెల్త్ సబ్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని మందులను, మాతా-శిశు కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో అధిక వర్షం కురిసే అవకాశం ఉన్నందున సిబ్బంది ఎవరు సెలవు తీసుకోకూడదని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మనుపాటి మౌనిక పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పీహెచ్‌సీలో బుధవారం ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో ప్రజలకు సాధారణ జలుబు, దగ్గు, జ్వరాలతో పాటు మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వర్షాల వల్ల ఇళ్ల పరిసరాల్లో నీరు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమల ఉత్పత్తి జరుగుతుందన్నారు. నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శుల సహకారం తీసుకుని ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల కృషితో దోమలు, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంస



క్రీడాకారులను అభినందిస్తున్న రోజా

నగరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి స్టార్‌ఆఫ్ ఇండియా సాధించిన క్రీడాకారుడు కె.సి.తేజేష్‌ని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనబరచి బెస్ట్ అప్ కమింగ్ ప్లేయర్ అవార్డు సాధించిన లక్ష్మీనరసింహారెడ్డిని, సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభకనబరచిన భానుప్రకాష్, ఇజాజ్, రిత్విక్, సిద్ధిక్‌లను మాజీ మంత్రి రోజా ప్రశంసించారు. బుధవారం తన స్వగృహానికి క్రీడాకారులను రప్పించిన ఆమె జాతీయ స్థాయిలో ప్రతిభచాటినందుకు గాను వారిని అభినందించారు. రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఖర్చులన్నీ భరించి, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపించారని, అప్పటి నుంచి ప్రతి పోటీలోనూ తమ పిల్లలు ప్రతిభకనబరచి పతకాలు సాధిస్తున్నారని క్రీడాకారుల తల్లిదండ్రులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

నగరి క్లస్టర్ డ్వామా ఏపీడీగా సునీల్‌కుమార్



నింద్ర, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): నగరి క్లస్టర్ డ్వామా ఏపీడీగా సునీల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏపీడీ శోభన్ బాబు తిరుపతి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. చిత్తూరు డ్వామా కార్యాలయంలో ఏపీడీ సీబీగా పనిచేస్తున్న సునీల్‌కుమార్‌కు నగరి క్లస్టర్ డ్వామా ఏపీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పంటల పరిశీలన

వెదురుకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):కార్వేటినగరం మండలంలోని పాదిరికుప్పం, అన్నూరు ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట పొలాలను ఏవో హేమలత పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్వలేకుండా పాదులు తీసుకోవాలని రైతులకు సూచించారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి: జేసీ



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళ్యం, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): రైతాంగానికి ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి కోరారు. బుధవారం మండలంలోని నలగాంపల్లె వద్ద రైతులు వినియోగిస్తున్న డ్రిప్ పరికరాలను పరిశీలించారు. డ్రిప్ పరికరాల వినియోగం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ అధికారిణి సాగరిక, ఏవో చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.